క్లుప్తంగా

విదేశ పర్యటన నుంచి నేడు రానున్న కోన

బాపట్ల: విదేశీ పర్యటన ముగించుకుని మంగళవారం సాయంత్రం బాపట్లకు మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి వస్తున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఎంపికైన తర్వాత బాపట్లకు వస్తున్న కోనకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీగా రైల్వేస్టేషన్‌కు సాయంత్రం ఐదు గంటలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలుపై హర్షం



వేమూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంపై బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు ముస్లింలంతా అండగా ఉంటారని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సహకరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యంతో దడ



కొల్లూరు : విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలకు ముప్పులా పరిణమించనుంది. విద్యుత్తు తీగలపై పడి వాటి ఆదరవుతో ఉన్న తాటి చెట్టును తొలగించకుండా మిన్నకుండటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. మండలంలోని సుగ్గునలంక మార్గంలో ఆదివారం రాత్రి వీచిన పెనుగాలులకు తాటి చెట్టు నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలపై పడింది. సోమవారం సిబ్బంది చెట్టును పరిశీలించినప్పటికీ తొలగించకుండా వదిలివేయడం ప్రమాదకరంగా మారింది. ఆ మార్గంలో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. స్థానికులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు కూడా గ్రామంలోకి రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్తు శాఖాధికారులు తక్షణం స్పందించి తాటి చెట్టును తొలగించాలని పలువురు కోరుతున్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట



రేపల్లె రూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు సూచించారు. వారోత్సవాలను పురస్కరించుకుని అగ్నిమాపక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఇళ్లలో వంట ముగిసిన తరువాత, రాత్రులు నిద్రపోయే సమయంలో తప్పనిసరిగా గ్యాస్ పొయ్యి రెగ్యులేటర్‌ను ఆపి వేయాలని తెలిపారు. విద్యుత్ వైర్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా సరి చూసుకోవాలని చెప్పారు. సమీపంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే వెంటనే సిబ్బందికి సమాచారం అందించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

1250 గ్రాముల గంజాయి స్వాధీనం

తెనాలిరూరల్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని టూ టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 1250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ రాముల నాయక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గంజాయి విక్రయాలపై పక్కా సమాచారంతో ఆర్టీసీ బస్టాండ్ ఔట్ గేట్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద స్థితిలో ఉన్న తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పఠాన్ మహబూబ్ సుభాని, పొన్నూరు మండలం దండమూడి గ్రామానికి చెందిన గంజేరుపల్లి శ్రీవర్ధన్ అలియాస్ శ్రీహరిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితులు మద్యం, గంజాయి తాగడం వంటి దురలవాట్లకు బానిసలని, వారికి పొన్నూరుకు చెందిన షేక్ ఆసిఫ్ పరిచయమై గంజాయి విక్రయించేవాడన్నారు. వారు సేవించటంతో పాటు తెనాలి రైల్వేస్టేషన్, బస్టాండ్ పరిసర ప్రాంతాలలో విక్రయించి సొమ్ము చేసుకుంటారని, ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం కూడా ఆసిఫ్ వద్ద గంజాయి కొనుగోలు చేసి, 50 గ్రాముల పొట్లాలుగా చేసి, రూ 500 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకునేందుకు వేచి ఉండగా పోలీసులకు పట్టుబడ్డారు. తెనాలి డిప్యూటీ తహసిల్దారు సమక్షంలో నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ గంజాయి విలువ రూ 12,500 ఉంటుందని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయం



గుళ్లపల్లిలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ గణేష్, నాయకులు



చెరుకుపల్లి పార్టీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న వరికూటి అశోక్‌బాబు, నేతలు

- వాడవాడలా జయంతి వేడుకలు
- వైఎస్సార్ సీపీ కార్యాలయాల్లో ఘనంగా నివాళులు

చెరుకుపల్లి: అన్ని వర్గాల ప్రజలు సమానంగా ఉండాలనే దూరదృష్టితో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప మేధావి అని రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా గుళ్లపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజలకు సమానంగా సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. ఆయన ఆశయ సాధనకు యువత పాటుపడాలని ఆయన సూచించారు.

■ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు దళిత నాయకులు, విద్యావేత్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. యువకులు పలు గ్రామాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు.

■ చెరుకుపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నాయకులు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వనర్ దుండి వెంకటరామిరెడ్డి, పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పితామహుడు అంబేడ్కర్

చుండూరు(వేమూరు): రాజ్యాంగ పితామహుడు అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ఆయన రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాల ఆధారంగానే ప్రభుత్వాలు పరిపాలన చేస్తున్నట్లు తెలిపారు. చెరుకుపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నేతలు పూలదండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంపీపీ లలిత కుమారి, పార్టీ మండల అధ్యక్షులు పడమట శ్రీనివాసరరావు, కొతవరపు పద్మావతి, సయ్యద్ సిరాజుద్దీన్, షేక్ అబ్దుల్, నాగమల్లేశ్వరరావు, మద్దుల గిరిధర్, వేల్పూరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనే ధ్యేయం

బాపట్ల: అంబేడ్కర్ ఆశయాలు సాధనే ధ్యేయంగా కృషి జరగాలని పలు సంఘాల నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గంలో పలు సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా స్థానిక మేధ కళాశాల్లో బీసీల నాయకులు, సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో మేధ శ్రీనివాసరావు అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సీహెచ్. గంగయ్య, మాజీ కౌన్సిలర్ జెట్టి జోసెఫ్, సీపీఐ నాయకులు తన్నీరు సింగరకొండ, రిటైర్డు ప్రిన్సిపాల్ శ్యామ్ లివింగ్‌స్టన్, నూతలపాటి కోటేశ్వరరావు, భాస్కరరావు, నాగేశ్వరరావు, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.



నగరంలో నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ

చీలు రోడ్డు సెంటర్‌లో..

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ పొందుపరిచిన రాజ్యాంగ స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్యార్లీ చిన్న, కాగిత రవి, జవహర్, రమేష్, ఆకురాతి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలనకు అంబేడ్కర్ కృషి

అంటరానితనం, కుల నిర్మూలన కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన భారతీయ రాజకీయవేత్త అంబేడ్కర్ అని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూనారాణి అన్నారు. భారత సమాజానికి, పాలనకు అంబేడ్కర్ విశేషమైన కృషి చేశారని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. సర్దార్ బేగ్ కొనియాడారు.

బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమ ఫలాలు అంబేడ్కర్ చలువే..

నగరం: బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన అంబేడ్కర్‌దేనని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఇంకోల్లు రామకృష్ణ కొనియాడారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నగరం సెంటర్‌లోని విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పార్టీల నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి .ఎన్. కోటేశ్వరరావు,నియోజకవర్గ బీసీ సెల్, వికలాంగ విభాగం, యువత అధ్యక్షులు పాగోలు వెంకటేశ్వరావు, బాలకృష్ణ, కొండలరెడ్డి, నాయకులు బాబూరావు, సుబ్బారావు,ఎంపీటీసీ సభ్యుడు ఉప్పాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



బాపట్ల రైల్వేస్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అంబేడ్కర్ ఆశయాల సాధనకు పాటుపడాలి

బాపట్ల: అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు జోగి రాజా పేర్కొన్నారు. సోమవారం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు నేరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. ఎంతో ప్రాముఖ్యం కలిగిన రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోయారని గుర్తు చేశారు. అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని పార్టీ నాయకులు చింతల రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మరుప్రోలు కొండలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, షోహిత్, పార్టీ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, కొక్కిలిగడ్డ చెంచయ్య, గొర్రుముచ్చు పుష్పరాజ్యం, వేల్పుల మీరాబీ, లక్ష్మీరాఘవ, పాపారావు, నర్రావుల వెంకట్రావు, నర్రా వెంకట్రావు, తన్నీరు అంకమ్మరావు, బడుగు ప్రకాశ్, అనిల్, రంగారావు పాల్గొన్నారు.



కర్లపాలెంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు

అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శనీయం

కర్లపాలెం: అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శనీయమని ఎంపీపీ యారం వనజ, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం కర్లపాలెం సెంటర్‌లోని విగ్రహాలకు ఎంపీపీ, ఎంపీడీవో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతో పేద, బడుగు, బలహీన వర్గాల వారికి మేలు జరుగుతుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు విన్నకోట సురేష్, అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్, అధ్యక్షుడు పేరలి ధనుంజయ్ వేరువేరుగా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

పిట్టలవానిపాలెంలో...



మేధ కళాశాల్లో పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు



చీలురోడ్డు సెంటర్‌లో దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో వేడుకలు



వ్యవసాయ కళాశాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు



పిట్టలవానిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సీతారామరాజు



కొల్లూరులో వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి పిట్టలవానిపాలెం సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నివాళులర్పించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు స్థానిక నాయకులు, అంబేడ్కర్ సేవా సమాజం సభ్యులు నివాళులర్పించారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

కొల్లూరు : రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం కొల్లూరు ఎస్సీ ఏరియాలోని ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు బిట్రగుంట సత్యనారాయణ, గరిక రమేష్, చిల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు శ్లాఘనీయం



తాలూకా సెంటరులోని నివాళులర్పిస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్, పార్టీ శ్రేణులు

రేపల్లె రూరల్: అంబేడ్కర్ జయంతి వేడుకలు రేపల్లె నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజకీయ పార్టీల కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం నిర్మూలనతో పాటు సమసమాజ స్థాపనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు అజరామరమని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. తాలూకా సెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నవరాజ్యాంగ నిర్మాతగా బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా అంబేడ్కర్ విశేష పేరు ప్రఖ్యాతలు సంపాదించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చదలవాడ శ్రీనివాసరావు, చిత్రాల ఓబేదు, చిమటా బాలాజీ, కేవీ కృష్ణారెడ్డి, సముద్రాల ప్రభుకిరణ్, కర్రా రత్నాకర్, వీసం నాగలక్ష్మి, అబ్దుల్ ఖుద్దూష్, లియాకత్ బాషా, కొలుసు బాలకృష్ణ, పట్టెం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

■ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్. మణిలాల్, నాయకులు వై.కిశోర్, ఆశీర్వాదం, చిట్టిబాబు, లక్ష్మణరావు, ధర్మరాజు పాల్గొన్నారు.

■ జైభీమ్ రావ్ భారత్ పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రేపల్లె నియోజకవర్గ కార్యదర్శి దోవా రమేష్ రాంజీ పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. ఆస్తి బుగ్గిపాలే !

- అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ
- నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర నష్టాలు
- జిల్లాలో ప్రారంభమైన అగ్ని ప్రమాద వారోత్సవాలు
- 20 తేదీ వరకు అవగాహన సదస్సులు
- నష్ట నివారణకు అవగాహన అవసరం



ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బాపట్ల టౌన్: సూరీడు నేలకొచ్చినట్టు ఎండలు మంట రేపుతున్నాయి. సామాన్య ప్రజలను అల్లాడిస్తున్నాయి. ఈ సమయంలోనే చిన్నపాటి అజాగ్రత్తతో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంది. తద్వారా సర్వం బుగ్గి అవుతుంది. తీవ్ర నష్టాన్ని మిగుల్చుతుంది. ఎండా కాలంలో అప్రమత్తత అవసరమని అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో అగ్ని ప్రమాదాలను అదుపు చేసేందుకు ఆ శాఖాధికారులు కూడా విశేష కృషి చేస్తున్నారు.

జిల్లాలో నాలుగు అగ్నిమాపక కేంద్రాలు

జిల్లాలో రేపల్లె, బాపట్ల, చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో నాలుగు అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో రేపల్లె ఫైర్ ఆఫీసర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. లీడింగ్ ఫైర్‌మెన్ మొత్తం 15 మంది ఉన్నారు. డ్రైవర్ ఆపరేటర్లు 16 మందికి గానూ తొమ్మిది మందే ఉన్నారు. ఫైర్‌మెన్‌లు 48 మందికి గానూ 24 మందే ఉన్నారు. 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హోంగార్డులు జిల్లాలో 11 మంది మాత్రమే ఉన్నారు. జిల్లావ్యాప్తంగా ఫైర్ ఇంజన్లు- 4, మిస్ట్ వెహికల్- 1, పోర్టబుల్ పంప్స్- 4, అడ్మినిస్టేటివ్ వెహికల్ -1, మోటర్ సైకిల్ విత్ మిస్ట్ ఎగ్జిటింగ్‌గేషర్ -1, రెస్క్యూ బోట్ -1, పవర్ సాప్స్ -5, అస్కా లైట్స్- 3 గానూ ఒకటి మాత్రమే పని చేస్తోంది. లైఫ్ జాకెట్స్ 50 అందుబాటులో ఉన్నాయి.

గతేడాది జిల్లాలో రూ. 9 కోట్ల నష్టం

జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 422 అగ్ని ప్రమాదాలు జరిగాయి. ప్రజలు రూ. 9 కోట్లు నష్టపోయారు. అగ్ని ప్రమాదాల్లో సిబ్బంది కూడా సకాలంలో స్పందించి రూ. 14 కోట్లు కాపాడారు.

14 నుంచి 20 వరకు వారోత్సవాలు

అగ్ని ప్రమాదాల నివారణలో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దానిలో భాగంగా ఈనెల 14న జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాలను సందర్శించి సిబ్బంది కుటుంబ సభ్యులతో సమీక్షలు నిర్వహించారు. 15న ప్రధాన కూడలి ప్రాంతాలైన రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్, మాల్స్, మార్కెట్, సినిమా థియేటర్లలో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. 16న అపార్ట్‌మెంట్లు, గ్యాస్ కంపెనీలు, విద్యుత్‌శాఖ కార్యాలయాలు సందర్శించి ఫైర్ సేఫ్టీ పరికరాల పనితీరును పరిశీలించి నివాసితులకు అవగాహన కల్పిస్తారు. 17న జిల్లావ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. 18న పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గోడౌన్స్ నిర్వాహకులకు, 19న హాస్పిటల్స్‌లో ఫైర్ సేఫ్టీపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. 20న ప్రమాదాలు సంభవిస్తే ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పిస్తారు.



బాపట్ల అగ్నిమాపక కేంద్రం

అగ్నిమాపక శాఖ సూచనలు

- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గి పుల్లలను ఆర్పివేసిన తర్వాత పారేయాలి
- చెత్త, గడ్డిని ఎండిన చెట్లు, పూరిపాకల వద్ద వేయరాదు
- ఎక్కువ రోజులు ఇంట్లో లేని సమయంలో విద్యుత్తు మెయిన్ ఆఫ్ చేయాలి
- వంట గదిలో గాలీ, వెలుతురు ఉండేలా చూసుకోవాలి
- ఇళ్లకు గడ్డి వాములు 60 అడుగుల దూరంలో వేసుకోవాలి
- పూరింట్లో నివసించే వారు వంట పూర్తయిన వెంటనే పొయ్యిలో నిప్పును ఆర్పి వేయాలి
- వేసవిలో ఉదయం 8 గంటల లోపు, సాయంత్రం 6 గంటల తరువాత కట్టెల పొయ్యిలను ఉపయోగించాలి.
- గ్యాస్ సిలెండర్‌కు దగ్గరలో పెట్రోలు, డీజిల్, కిరోసిన్ వంటి మండే వస్తువులను ఉంచరాదు
- వంట పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆపి వేయాలి
- అపార్ట్‌మెంట్లు, కర్మాగారాల గోదాములు, గిడ్డంగులలో అగ్నిమాపక శాఖ సూచనలు విధిగా పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

సమాచారం అందిస్తే తక్షణమే స్పందిస్తాం



అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తాం. అగ్నిమాపక శకటం వచ్చేలోగా నీటితో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించాలి. తద్వారా నష్టం కాస్త తగ్గుతుంది. ప్రమాదం జరిగిన వెంటనే 101, బాపట్ల ఫైర్‌స్టేషన్ - 08643224311, చీరాల- 08594 232299, రేపల్లె 08648 222101, అద్దంకి 0859 3224101 నంబర్లకు సమాచారం అందించాలి.

– సి. మాధవ్‌నాయుడు, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి

ఆకట్టుకున్న 'సాహితీ సూక్తం' నాటిక



సాహితీ సూక్తంలో సన్నివేశం

తెనాలి: డాక్టర్ వై ఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ఇక్కడి ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతున్న జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీలు మూడో రోజైన కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి స్వర్ణ సూర్య డ్రామా లవర్స్, హైదరాబాద్ వారి 'సాహితీ సూక్తం' నాటికను ప్రదర్శించారు. సమాజంలో మోసం చేయటం, మోసపోయిన వాళ్ల రకరకాల బాధలు అనుభవించటం జరుగుతూనే ఉంటుంది. కొందరు మోసపోయిన బాధతో ఆత్మహత్యతో జీవితాలను చాలిస్తున్న ఉదంతాలున్నాయి. మోసగించిన వారిని హత్య చేసినా, నిజంగా శిక్ష అనుభవించే వారు ఎవరు? అనే ప్రశ్నలు సహజం ఇలాంటప్పుడు సాహిత్యం బాధ్యత ఏమిటి... సామాజిక సమస్యలకు సాహిత్యం ఎటువంటి సమాధానం చెప్పాలనేది అంశాలను చర్చించిందీ నాటిక. ఉదయ్ భాగవతుల రచించిన ఈ నాటికకు ఆయనే దర్శకత్వం వహించారు. ఉదయ్ భాగవతులతోపాటు ద్వాదశి చంద్రశేఖర్, కార్తీక్ చట్రా, కుమారి, జాహ్నవి నటించారు. సంగీతం రమణ. నాటిక ప్రదర్శనకు ముందుగా ఆరిశెట్టి ఐశ్వర్య శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన ఆహూతులను అలరించారు. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో జరుగుతున్న ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి పిట్టు వెంకటకోటేశ్వరరావు పర్యవేక్షించారు.